క్లుప్తంగా

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యం



రేపల్లె: మండలంలోని పేటేరు గ్రామ సచివాలయం–2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచి వసుమతి ప్రారంభించారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన విశేష స్పందన లభించింది. అనంతరం 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, మండల ఉపాధ్యక్షురాలు రావు నెహ్రూలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు పాల్గొన్నారు.

చంద్రగ్రహణ దృష్ట్యా ఆలయాలు మూత

భట్టిప్రోలు: చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం భట్టిప్రోలు మండలంలోని దేవాలయాలను మూసివేశారు. స్థానిక భ్రమరాంబ మల్లేశ్వర స్వామి, దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన విశలేశ్వరస్వామి దేవాలయాలు సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు మూసి ఉంటాయని కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు తెలిపారు. ఆలయ శుద్ధి(స్నపన) అనంతరం దర్శనానికి అనుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పెదపులివర్రులో కొలువైన వరదరాజ స్వామి దేవాలయం కూడా మూసి వేసి ఉదయం తెరిచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

దుండి పాలెం(వేమూరు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఉదయం 7 గంటలకు చుండూరు మండలంలోని దుండిపాలెంలో నిర్వహించనున్నట్లు సర్పంచి కంచెల భగవద్గీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని చెప్పారు.

సస్య రక్షణ పద్ధతులు పాటించాలి



కర్లపాలెం: వరిలో సస్య రక్షణ పద్ధతులు పాటించాలని డీడీఏ విజయనిర్మల తెలిపారు. యాజలి, ఏట్రవారిపాలెం గ్రామాలలో నీరు లేక వాడుతున్న వరి పైర్లను శనివారం వ్యవసాయాధికారులు సందర్శించారు. విజయనిర్మల మాట్లాడుతూ తేమలేక వాడిపోతున్న వరి పైర్లకు అధికంగా ఎరువులు వేయకూడదని సూచించారు. లీటరు నీటికి పొటాషియం నైట్రేట్, 3.5గ్రాములు, యూరియా 20గ్రాములు, డీఏపీ పది గ్రాముల చొప్పున కలుపుకుని పది రోజుల వ్యవధిలో రెండు మూడు దఫాలుగా పైరుపై పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మి, ఏరువాక శాస్త్రవేత్తలు ఓబయ్య, సురేఖ, ఏఈఓ భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గోపీ కృష్ణ, శివ ప్రసాద్, శివ నాగరాజు ఉన్నారు.

రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు జాబితాలు



నగరం: రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు జాబితాలను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని ఏలేటిపాలెం రైతు భరోసా కేంద్రంలోని పంట నమోదు జాబితాలపై శనివారం జరిగిన గ్రామ సభలో ఏవో పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్‌లో సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్ జాబితాలను రైతుల సందర్శనార్ధం రైతు భరోసా కేంద్రాలలో ఉంచినట్లు వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి వారాబందీ ప్రకారం సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వరి పంట బెట్టకు వస్తే పోటాషియం నైట్రేట్ ఒక కేజీ ద్రావణాన్ని తగిన నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పఠాన్ జాఫర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: ఆర్టీసీ పరిధిలో కొనసాగుతున్న కార్గో కొరియర్, పార్శిల్ సర్వీసు సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ కోరారు. ఆర్టీసీ ద్వారా కొరియర్ పంపించిన వారికి డోర్ డెలివరీ కూడా చేస్తున్నట్లు చెప్పారు. కొరియర్ సేవలు కేవలం రూ.70లోకే అందించడం జరుగుతుందని చెప్పారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



పాఠశాల బోర్డుపై జై జగన్ అని రాస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి



చందోలులో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కోన రఘుపతి

బస్సు యాత్ర విజయవంతం

- సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన జనం
- ఉల్లాసంగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- పూలు చల్లి హారతులిచ్చిన మహిళలు

కర్లపాలెం: సామాజిక సాధికార బస్సు యాత్రకు విశేష జనస్వాగతం లభించింది. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని సంగుపాలెం కోడూరులో మధ్యాహ్నం 12 గంటలకు యాత్రను ప్రారంభించారు. వేలాదిమంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సామాజిక సాధికార బస్సుయాత్రకు స్వాగతం పలికారు. బస్సు యాత్రలో వచ్చిన వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీతలకు మహిళలు పూలు చల్లి హారతులిచ్చి గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. సంగుపాలెం కోడూరు



మంత్రి జోగి రమేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న గీత కార్మికులు

నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ముందుకు సాగగా సామాజిక సాధికార బస్సుయాత్ర చందోలు బండ్లమ్మ తల్లి ఆలయం వద్దకు చేరింది. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పూర్ణ కుంభంతో బస్సు యాత్రలో వచ్చిన నాయకులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆలయంలోనికి తీసుకువచ్చారు. తొలుత హోమగుండం వద్ద పూజలు చేయించారు. అనంతరం నాయకులు మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. తరువాత సామాజిక సాధికార యాత్ర నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకోగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నాయకులకు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం నాడు, నేడు నిధులతో పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను నాయకులు పరిశీలించారు.

అనంతరం పాఠశాల ఆవరణలో భోజనాలు తరువాత సామాజిక సాధికార బస్సు యాత్ర చందోలు నుంచి రెడ్డిపాలెం సెంటర్‌కు చేరుకోగా మహిళలు, నాయకులు స్వాగతం పలికారు. కర్లపాలెం సెంటర్‌లో టపాసులు కాల్చి జై జగన్, జైజై కోన అంటూ నినాదాలు చేశారు. అనంతరం నాయకులు సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీగా బాపట్ల తరలివెళ్లారు. మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మధ్యాహ్నం 12గంటలకు చేరుకుని సాయంత్రం 5గంట వరకు సామాజిక సాధికార బస్సుయాత్ర వచ్చేంత వరకు ఉండటంతో సెంటర్‌లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమాలలో పీవీ



కర్లపాలెం సెంటర్‌లో సామాజిక సాధికార బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

పాలెం ఎంపీపీ ఎస్‌కే బాజీ, బాపట్ల ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, కర్లపాలెం జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, పీవీ పాలెం, కర్లపాలెం మండల వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చిరసాని నారపరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, బండ్లమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వాహణాధికారి జి.నరసింహ మూర్తి పాల్గొన్నారు.

పేటీఎం మిషన్ల అందజేత

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ క్రాంతి పథం యానిమేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, బాపట్ల జిల్లా స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె. నాగబాబు, రేపల్లె క్లస్టర్ ఏరియా కో–ఆర్డినేటర్ పి.రమాదేవి, స్త్రీ నిధి మేనేజర్ పి.అశోక్ హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. స్త్రీ నిధి లావాదేవీలు సులభతరం చేయడం కోసం రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లాలో కొన్ని మోడల్ మండలాలను ఎంచుకుని ఆ ప్రాంతాల్లో స్త్రీ నిధి లావాదేవీల అవకతవకలకు అవకాశం లేకుండా, ఆలస్యం జరగకుండా పేటీఎం మిషన్ల ద్వారా ముందుగా సిబ్బందికి



యానిమేటర్లకు పేటీఎం మిషన్లు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

యానిమేటర్లకు శిక్షణ ఇచ్చి మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు కె.రజనీ కుమారి, డి.హనోకు, కె.సాంబయ్య, అకౌంటెంట్ బి.శిరీష పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

చుండూరు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించి మంచి దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ శాఖ బాపట్ల జిల్లా డీపీఎం వి.వాణిశ్రీ సూచించారు. శనివారం మండలంలోని మున్నంగివారిపాలెంలోని రైతుభరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘన, ద్రవ జీవామృతాలు, పంటల్లో రసంపీల్చు పురుగుల నివారణకు నీమాస్త్రం ఏ విధంగా తయారు చేసుకుని పిచికారీ చేయాలో అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ విజిట్ సిబ్బంది వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా డీపీఎం వి.వాణిశ్రీ

ప్రాణధార ప్రాజెక్టుతో రైతులకు మేలు

బాపట్ల అర్బన్: ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి సాగులో ప్రాణధార సంస్థ చేపట్టిన విధానం ఎంతో మేలు కలిగిస్తోందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. బాపట్ల మండలంలోని జమ్ములపాలెంలో ప్రాణధార సంస్థ 'పొడి నేలలో వరి విత్తనం వెద పెట్టు విధానానికి అనువైన వరి వంగడాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రానున్న పరిస్థితుల్లో వరి సాగులో వెద పద్ధతి అనుకూలమైందన్నారు. ప్రాణధార సంస్థ చేపట్టిన విధానంతో నీటి ఎద్దడిని తట్టుకునే సామర్థ్యం సాధించవచ్చని చెప్పారు. అనంతరం ప్రాణధార సంస్థ చేపట్టిన వరి క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ప్రపంచ వరి పరిశోధన సంస్థ, ఫిలిప్పైన్స్ నుంచి రైస్ బ్రీడర్ డాక్టర్ సలాబ్ దీక్షిత్, రైస్ బ్రీడర్ డాక్టర్ వికాస్ కుమార్ సింగ్,



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

డాక్టర్ పల్లవి సింహ, అఖిల భారత వరి పరిశోధన సంస్థ డాక్టర్ మహేంద్ర కుమార్, డాక్టర్ గిరీష్, ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టర్ కృష్ణవేణి, గిరిజారాణి, తుమ్మల యుగంధర్, నెక్కంటి కిరణ్ ప్రకాష్ బాపట్ల, గుంటూరు, కృష్ణ, ప్రకాశం, గోదావరి జిల్లాల నుంచి రైతులు పాల్గొన్నారు.

పురాణాలను ప్రగతిశీల భావాలతో పునర్లిఖించాలి

- విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ
- పంపాతీరం నవలపై చర్చా

తెనాలి: మానవ సమాజాన్ని అసమానతలకేసి నడపటంలో ముఖ్యమైన పాత్రను పోషించిన పురాణాలను ప్రగతిశీల అభ్యుదయ భావాలతో పునర్లిఖించాలని విప్లవ రచయితల సంఘం(విరసం) రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ అభిప్రాయపడ్డారు. జ్యోతిబా పూలే ఇందుకో మార్గం వేస్తే, త్రిపురనేని పునాది వేయటానికి తోడ్పడ్డారని చెప్పారు. ఆ పరంపరంలో చలం నుంచి నేటి ఓల్గా వరకు పురాణ ఇతిహాసాల్లోని ఏదొక సారాంశాన్ని మేధో ప్రపంచంలో నాటేందుకు కృషి చేశారని అన్నారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా రచన ×పంపాతీరం నవలపై శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చర్చా వేదిక నిర్వహించారు. అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ రాముడు పేరుతో దేశాన్ని హిందుత్వ రాజకీయం వైపు పయనింపజేసే విధానాన్ని, అందులోని రాజకీయ పార్శ్వాన్నీ అర్థం చేసుకుని శబరి రూపంలో ఓల్గా తన రచనలో బహిర్గతం చేసినట్టు వివరించారు. ఇలాగే ముందుకెళితే దేశం మరింత వెనక్కు వెళుతుందని హెచ్చరించారు. ప్రముఖ కవి, కవిత సంపాదకుడు బండ్ల మాధవరావు తన ప్రసంగంలో, రాజ్యం ప్రకృతినీ, అందులోని మనుషులపై చూపే క్రౌర్యాన్ని ఓల్గా హృద్యంగా రాసినట్టు చెప్పారు. రామాయణంలోని శబరి పాత్రతో వర్తమాన పరిస్థితులను ఆసక్తికి చెప్పారనీ అన్నారు. సమన్వయకర్త జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతి పేరుతో భావజాలం వ్యాప్తి జరుగుతోందని, చనిపోతూ హేరామ్ అనీ, చంపుతూ జైశ్రీరామ్ అంటున్నారని చెబుతూ ఏ రాముడివైపు ఉండాలో మనమే నిర్ణయించుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ పిల్లి వాసు మాట్లాడారు. తొలుత ఆహ్వానం లక్ష్మిని స్మరించుకున్నారు. పంపాతీరం రచన గురించి, ఆహ్వానం లక్ష్మితో తన అనుబంధాన్ని వివరిస్తూ ఓల్గా పంపిన ఆడియో సందేశాన్ని వినిపించారు. జుగాష్ విలి పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న అరసవిల్లి కృష్ణ, వేదికపై బండ్ల మాధవరావు, నాగేశ్వరరావు, వాసు

భర్తిపూడి రైల్వేగేటు మూసివేత

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం భర్తిపూడి గ్రామంలోని రైల్వేగేటు నంబరు 261ను రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిమిత్తం ఈనెల 30 నుంచి 2024 మే 31 వరకు సుమారు ఏడు నెలలు కాలం పాటు మూసి వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శనివారం తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గంగా గుడిపూడి – ఈతేరు రైల్వే గేటు వైపుకు ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కేఎల్‌యూ ఒప్పందం

తాడేపల్లిరూరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కేఎల్‌యూ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుని ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నట్లు యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు వెల్లడించారు. శని వారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ యూలో ఏర్పాటు చేసిన రక్తదాన అవగాహన సదస్సుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థులు ఓ వ్యక్తి నిండు ప్రాణంతోపాటు ఒక కుటుంబానికి భరోసా కల్పించిన వారు అవుతారన్నారు. రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఇచ్చే సర్టిఫికెట్ విద్యార్థులకు ఉద్యోగ అన్వేషణ సమయంలో చాలా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల జాబితాలో కేఎల్‌యూ విద్యార్థులు రక్తదానం చేయడంలో ముందజలో ఉన్నారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలసి పనిచేయడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, యూత్ రెడ్‌క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె. సుకీర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాతృశ్రీ ఓరియంటల్ కాలేజ్‌కు నాక్ గ్రేడ్

బాపట్ల అర్బన్: మాతృశ్రీ ఓరియంటల్ కాలేజ్‌కు నాక్ గ్రేడ్ రావడం అభినందనీయమని అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య అన్నారు. బాపట్ల జిల్లా జిల్లెళ్లమూడిలో ఉన్న మాతృశ్రీ ఓరియంటల్ కాలేజీలో మూడు రోజులుగా నాక్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య ముఖ్య అతిథిగా పాల్గొని అధ్యాపకులకు నాక్‌పై అవగాహన కల్పించారు. నాక్ మాన్యువల్‌లో నాణ్యత ప్రమాణాలను, పరిణామాత్మక ప్రమాణాలను ఏ విధంగా కలిగి ఉండాలనే అంశాలను వివరించారు. విశ్రాంత ఆంగ్ల ఆచార్యులు డాక్టర్ బి.వరలక్ష్మి మాట్లాడుతూ బెస్ట్ ప్రాక్టీస్, ఎక్స్టెన్షన్ యాక్టివిటీస్, విజన్, మిషన్ గురించి వివరించారు. శివయ్య సహాయకులు హరి కుమార్ నాక్‌కు సంబంధించిన కంప్యూటర్ వర్క్ చేయవలసిన విధానాన్ని తెలిపారు. కన్వీనర్ డాక్టర్ బి.వి.ఎస్.లక్ష్మి మాట్లాడుతూ మాతృశ్రీ ఓరియంటల్ కాలేజీకి నాక్ గ్రేడ్ సాధించడంలో, కళాశాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది మహోన్నతంగా కృషి చేస్తూ సఫలీకృతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నదానం హనుమత్ ప్రసాద్, కరస్పాండెంట్ గోగినేని రాఘవేంద్రరావు, కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ డాక్టర్ బి.వి.ఎస్.లక్ష్మి, నాక్ కన్వీనర్ రామబ్రహ్మం, నాక్ అడ్వైజర్ శరచ్చంద్ర పాల్గొన్నారు.



నాక్ ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎం.శివయ్య, డాక్టర్ బి.వరలక్ష్మి, డాక్టర్ లక్ష్మి

వెనుకబడిన వర్గాల సంరక్షణ బాధ్యత అధికారులదే

ఆర్డీఓ హేలా షారోన్

రేపల్లె రూరల్: సమాజంలో వెనుకబడిన వర్గాల సంరక్షణ బాధ్యత అధికారులపై ఉందని ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీలకు వారి హక్కులపై అవగాహన కల్పించాలని కోరారు. ఏళ్ల తరబడి కాల్వ గట్టులపై నివాసం ఉంటూ ఎటువంటి గుర్తింపు పొందని ఎస్టీలను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందుగా వారికి ఆధార్ కార్డు, రేషన్‌కార్డులు కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పలు అంశాలపై చర్చించారు. డివిజన్ పరిధిలో నమోదై ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలను డీఎస్పీ మురళీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీఓ శివపార్వతి, ఏఎస్‌డబ్ల్యూఓ కట్టా సత్యనారాయణ, వార్డెన్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ హేలా షారోన్, హాజరైన వివిధశాఖల అధికారులు

వైకుంఠపురం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా సాయిబాబు



ఎమ్మెల్యే శివకుమార్‌తో నూతన పాలకవర్గం

తెనాలి: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురం ఆలయ ట్రస్టుబోర్డు నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ట్రస్టుబోర్డు చైర్మన్‌గా కుంభం సాయిబాబు, సభ్యులుగా దేవరకొండ శంకరరావు, మావులూరి శ్రీనివాసరావు, బొద్దులూరి లక్ష్మీసరస్వతి, దేవరకొండ వెంకటరమణ, కురగంటి సునీత, బట్టు దుర్గారావు గురుస్వామి, ముంత దుర్గాప్రసాద్, కనికిచర్ల చరణ్ రత్న సందీప్, వంగల జగదీశ్వరి నియమితులయ్యారు. తమ నియామకానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను శనివారం గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన ఆలయ పాలకవర్గం కలసి ధన్యవాదాలు తెలిపారు. పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం నవంబరు 9వ తేదీన జరుగుతుందని చెప్పారు. వీరితో జగ్గడిగుంటపాలెం సర్పంచి కుంభం బాలాజీ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, పార్టీ నాయకులు చట్టు శ్రీనివాసరావు, గరికా శ్రీనివాసరావు ఉన్నారు.

ఉపకార వేతనాలు పంపిణీ

తెనాలిఅర్బన్: వడ్లమూడి కోటయ్య చౌదరి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపేటలోని ఎన్‌జీవో హోమ్‌లో విద్యలో ప్రతిభ చూపించే 92 మంది విద్యార్థులకు రూ.15.74 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు, మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 27 సంవత్సరాల నుంచి అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ శారద, జీడీవీ ప్రసాదరావు, డాక్టర్ జీపీ రామారావు, కె.అజయ్‌కుమార్, వడ్లమూడి బసవప్రసాద్, వడ్లమూడి బసవరావు పాల్గొన్నారు.